కామెడీ కథ

# లైన్‌లో పడేవాళ్ళు

''మగవాడు తలుచుకుంటే, లైన్‌లో పడని ఆడవాళ్ళుంటూ వుండరోయ్! మెల్లగా ప్రొసీడ్ అవ్వాల్సిన వాళ్ళూ, తుపానులా కమ్ముకుపోతే పడేవాళ్ళూ, సెంటిమెంట్‌కి పడేవాళ్ళు, సబ్‌మిసివ్‌గా వుంటే లొంగేవాళ్ళు...ఇలా రకరకాల వాళ్ళుంటారు. ఆడపిల్లను బట్టి, ఆ పిల్ల మనస్తత్వాన్ని బట్టి, మన ఎప్రోచ్‌ని, వ్యూహాన్ని మార్చుకుంటూ పోవాలంతే! ''

''అప్పటికీ పడకపోతే గురూగారూ!'' విచారంగా అడిగాడు అనూష్.

నా ఉపన్యాసానికి కామా పెట్టి, అతడిని ఎగాదిగా చూసాను.

నా జవాబు మీదే అతడి భవితవ్యం ఆధారపడ్డట్టు చూస్తున్నాడు.

''ఒక్క టీనేజ్ ఆడపిల్లని లైన్‌లోకి లాక్కోలేని వాడివి నువ్వేం మగాడివోయ్''

''డామేజింగ్‌గా మాట్లాడుతున్నారు!'' ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

''ఏ ఇమేజీ లేనివాడికి డామేజీ గతని ఈమధ్యే ఎక్కడో విన్నాను!'' కుర్చీలో కూర్చుంటూ ఇంకొంచెం కారం అద్దాడు ఇందర్.

''మీ విషయం మీరు చూసుకోండి సార్!'' ఉక్రోషంగా చెప్పాడు.

చిన్నగా భుజాలు కుదించి, ''యాజ్ యు సెడ్!'' అని అనూష్‌తో అని, నా వైపు తిరిగాడు, ''మీరు చెప్పిన వ్యూహం ఫలించింది గురూగారూ!'' వినమ్రంగా చెప్పాడు.

''వినుత సంగతేనా? రూమ్‌కొచ్చేసిందేవిటి?'' సంభ్రమంగా అడిగాను.

''లేదండీ! దానికింకా టైముంది! నేను చెప్పేది, తన రెస్పాన్స్ సంగతి. ఇదివరకు పలకరిస్తే చాలు, పొడిచేట్టు చూసేది! మొన్నరాత్రి మావిడి చెట్టు వెనకాల దొరికింది. ముందు మర్యాదగానే అడిగాను, ''మావిడాకులకోసం వచ్చారా?'' అని, ''కాదు కొబ్బరాకుల కోసం వచ్చాను, కోతులున్నాయని తెలిసి వెళుతున్నాను!'' అంది కొట్టినట్టు. .ముందు కొంచెం భయం వేసిందిలెండి! కానీ మీరు చెప్పారుగా! పొగరుగా వుండే అమ్మాయిలకి, తనకంటే పొగరుండే అబ్బాయిలే నచ్చుతారని! ధైర్యం చేసి, చేయి పట్టుకున్నాను.''

అదిరిపడ్డాను, ''కొంపముంచావోయ్!''

''కాదు గురూగారూ! ఈ కొంప తేల్చేదేకానీ ముంచేది కాదు!''

''ఆ తర్వాతేమయ్యిందో చెప్పవోయ్! ఆ అమ్మాయసలే మెత్తనైనది కాదు. కాళికాదేవికున్నంత రౌద్రమూ, దుర్గాదేవికున్నంత ధైర్యమూ వున్న పిల్ల''

''కంగారు పడాల్సినదేమీ లేదండీ! చెయ్యి పట్టుకున్నానా? వెంటనే సూటిగా అడిగేసాను. నేనింత మర్యాదగా మాట్లాడుతూంటే నీ విదిలింపేవిటని? నాక్కానీ తిక్కరేగిందో ముద్దుపెట్టేసుకుంటానంతే! దిక్కున్న చోట చెప్పుకోమన్నాను.''

''ఓరినీ! చూసి రమ్మంటే కాల్చొచ్చే రకం కదూ నువ్వు!''

''ఏదో మీ దయ!''

''తర్వాత? అది చెప్పుముందు!''

''అన్నిటికీ తెగించినవాడిలా నిలబడ్డాను కానీ, మనసు బితుకుబితుకుమందిలెండి లోపల..''

''నీ సంగతి తర్వాత చెప్పవచ్చులేవోయ్! వినుత సంగతి చెప్పు'' విసుక్కున్నాను.

''ఊచి పుచ్చుకుని కొడుతుందనుకున్నాను. అదేమీ లేదు. నెమ్మదిగా కళ్ళెత్తి, నా కళ్ళల్లోకి చూసింది. మెల్లగా నా చెయ్యి విడిపించుకుని వెళ్ళి అరుగుమీద కూర్చుంది..''

''ఆ తర్వాత?''

అప్పటి దాకా హావభావ ప్రకటనతో, నానావిన్యాసాలు చేస్తూ చెప్పున్నవాడు కాస్త రిలాక్స్‌గా కుర్చీలో వాలిపోయాడు.

''చెప్పవోయ్!'' గద్దించాను.

''ఆ రాత్రంతా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం!''

''రాత్రంతా!?''

''అవును గురూగారూ!''

''పక్కపక్కన కూర్చుని!?''

''కాదు గురూగారూ!''

''ఆ స్టేజి కూడా దాటిపోయారా?''

''అప్పుడేనా?''

''మరెక్కడ కూర్చుని చెప్పుకున్నారు?'' అప్పటిదాకా సంభ్రమంగా వింటూన్న అనూష్ ఉత్కంఠగా అడిగాడు.

''నేను చెట్టుమీద కూర్చుని, ఆ అమ్మాయి చెట్టు కింద నిలుచుని!''

''వ్వాట్?!''

''నిన్న పండగ కదా! మావిడాకులు కోసిపెట్టమంది! మొత్తం పన్నెండు కుటుంబాలకి! తను తోడుగా నిలుచుని కబుర్లు చెప్పింది. ఆ ఓపిక చూస్తే ముచ్చటేసిందిలెండి..!''

''అవి కూడా అయిపోయాయా?'' అనుమానంగా అడిగాను.

''ఏవి గురూగారూ?''

''అవే..ముచ్చట్లు..అవీ..!''

''అమ్మో! అప్పుడేనా? గొంతు నులిమేస్తుంది! ఆ మావిడి చెట్టుకిందే తవ్వి, పూడ్చిపెట్టేస్తుంది. మీరే చెప్పారుగా! అతి తొందర అనర్థదాయకమని! 'ఇంచ్ బై ఇంచ్ స్టెప్ బై స్టెప్' అన్నారుగా!''

చటుక్కున సర్దుకున్నాను. ''అవునవును! అక్కడితో ఆగాల్సిందే! రెండు రోజులు పోయాక, ఇంకొంచెం చొరవ చేద్దువుగాని!''

''అబ్బే కుదరదు గురూగారూ!''

''నీ దుంపతెగ! రెండ్రోజులు కూడా ఆగలేవా?''

''అది కాదండి! వారం రోజుల దాకా కుదరదు!''

అర్థం కాలేదు నాకు, ''అదేం?''

''సిటీలో పుట్టి పెరిగాను కదా! చెట్లెక్కడం అలవాటు లేక..హి..హి..హి..కొంచెం నడుం పట్టేసింది. వారం రోజులు సెలవుపెట్టి రెస్టు తీసుకోమన్నాడు డాక్టరు! వస్తాను గురూగారూ! నాల్రోజులాగి కలుస్తా!'' నెమ్మదిగా లేచి వెళ్ళిపోయాడు ఇందర్.

అయోమయంగా అతడు వెళ్ళినవైపే చూస్తూండిపోయాను.

''నేనూ వెళ్ళొస్తానండీ!'' లేచాడు అనూష్.

''కూర్చో! కూర్చో! చెప్పడం ఇంకా పూర్తికానిదే!'' కంగారుగా వారించాను.

''వద్దండీ! ఆయన పరిస్థితి చూసాక..''

''ఆ కేసు వేరోయ్! నీ పరిస్థితి వేరు! ఆ వినుత చాలా డైనమిక్ గర్ల్‌లే! ఆ అమ్మాయికి లైనేయడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు! దానికి ఎంతో పట్టుదల, ఓర్పు, ధైర్యం కావాలి! దానికా సేల్స్ మేనేజరే తగును. నీ ఫియాన్సీ సంగతి వేరు! చక్కటి పిల్ల! బుద్ధిమంతురాలు! కాలేజీ-ఇల్లు, ఇల్లు-కాలేజీ...

''ఇప్పుడు కొత్తగా కంప్యూటర్ కోర్సుకి

క్కూడా తెలుతోంది!''


''అలాగా! ఇంకేం! అవకాశాలు నిన్ను వెతుక్కుంటూ వస్తున్నాయోయ్! సరే విషయం విను! క్లాసుకి ఎన్నింటికి బయలుదేరుతుంది?''

''సాయంకాలం...ఐదు ఐదున్నరకి!''

''ఏడింటికి అయిపోతుందా?''

''అయిపోతుందండి!''

''సరిగ్గా ఆ వేళకి ఇన్స్టిట్యూట్ బయట ఎదురుచూడు! ఇంటి దగ్గర దింపుతాను! రమ్మని మర్యాదగా..వింటున్నావా..చాలా పొలైట్‌గా..వినయంగా రిక్వెస్ట్ చెయ్యి. అలాని అతివినయం ప్రదర్శించేవు..ధూర్తలక్షణమని బెదిరిపోతుంది జాగ్రత్త!''





''రాదండి! ఎంత వినయంగా అడిగినా పరాయి మగవాడి మోటర్ సైకిల్ ఎక్కే పిల్లలా కనిపించడం లేదు!''

''తొందరపడకోయ్! ఒక రోజు కాదంటుంది, రెండు రోజులంటుంది, పోనీ, వారం రోజులంటుంది. ఒక ఫైన్ మార్నింగ్...ఐమీన్...ఈవినింగ్ అభిమానానికి, నువ్వు చూపిస్తున్న గౌరవానికీ మెచ్చి, తప్పక ఒప్పుకుంటుంది.''

''వారం రోజులా?''

''ఏం అంత ఓపిక లేదా? సరే అయితే! ఈరోజే అడుగు! కాదంటే, బలవంతం చేయి!''

''దవడ వాయగొడుతుందండి!''

''కొడుతుంది! అయితేనేం? అటో, ఇటో తేలిపోతుంది!''

''మీక్కూడా వేళాకోళం అయిపోయానండీ!'' బిక్కమొహం వేసుకుని అన్నాడు.

''మరేవిటోయ్ ఆ తొందర? పేషన్స్! హావ్ సమ్ పేషన్స్! ఆడపిల్లలతో వ్యవహారమా మరేమన్నానా? ఈ వ్యవహారాలు తెగిపోవడం తేలికే! ముడిపడటమే కష్టం! ఆ చివరిముడేదో ఆ అమ్మాయే వేసిందనుకో, అది తెంపుకోలేక నీ దుంప తెగుతుంది కానీ, అది మాత్రం తెగదు!''

''అయ్యబాబోయ్! మరీ అంతగా బిగిసిపోతే నాకొద్దండి! మా అమ్మ నాన్న పాతికేళ్ళవాడినని కూడా చూడకుండా వీపు చిట్లగొడతారు!''

''అదేవిటి? పెళ్ళి దాకా తీసుకువెళ్ళాలనుకోవడం లేదూ?''

''లేదండీ!'' ఖచ్చితంగా చెప్పాడు. ''పెళ్ళంటే ఎన్నండీ? కట్నం కావాలి, చదువు చూడాలి, రూపున చ్చాలి...అవన్నీ అమ్మానాన్న అయితే జాగ్రత్తగా చూసుకుంటారు! అనుభవజ్ఞులు కదండీ! ఇదంతా జస్ట్..ఏదో టైమ్‌ని ఆక్యుపై చెయ్యడానికి!''

''మరి ఆ అమ్మాయి నిజమేననుకుంటే?''

''మీరే కదండీ చెప్పారు! ఇప్పుడు అమ్మాయిలందరూ చాలా మారిపోయారని, పెళ్ళికి ముందు ఇలాంటి అఫైర్సుండటం ప్రివిలేజ్‌గా భావిస్తున్నారనీ, వారికీ సరదాగానే వుందనీ, పెద్దగా కట్టుబాట్లు పెట్టుకోవడం లేదనీ...

''ఓయ్! ఓయ్! ఆగక్కడ! అన్నీ నా మీదికి తోసేస్తున్నావు! నీ తెలివి తేటలు నా దగ్గర కాదు. ఇవన్నీ సర్వే చేసి చెప్పింది మీ కుర్రకారు కాదూ! కాబోలనుకున్నాను! 'మీ అనుభవంతో సలహాలివ్వండి గురూగారూ' అంటే ఏవో నాకు తోచిన సలహాలు నాలుగు చెప్తున్నాను. అనుభవశూన్యంగా ఖంగారు పడిపోతూంటే ధైర్యం చెప్తున్నాను..అంతే కానీ..''

వెంటనే తగ్గిపోయాడు అనూష్ ''అయ్యయ్యో! మీరు అపార్థం చేసుకుంటున్నా

**అర్చన రాంపల్లి**

రండీ! నా ఉద్దేశ్యం అది కాదు..ఇందాకేదో చెపుతూ మధ్యలో ఆపేసా.. మోటార్ సైకిలెక్కించుకున్నాకా..''

''ఇంక నాకు తెలియదోయ్!''

''అలాగనకండి గురూగారూ! ప్లీజ్ మిమ్మల్నే నమ్ముకున్నాం!''

''కుదరదోయ్!''

''రెండు, మూడు నెలలు మీ స్టోరు అకౌంట్సు చూసి పెడతానండి!''

''రెండు...మూడు...కుదరదోయ్!''

''పోనీ నాలుగైదు! పోనీ ఇక్కడున్నంత కాలం!''

''సరే అయితే!''

''థాంక్సు గురుగారూ!'

''ఓ ఇరవై రోజుల పాటు భద్రంగా ఇంటి దగ్గర దింపి వస్తూండు! మధ్యలో సడన్ బ్రేకులెయ్యటం, టర్నింగుల దగ్గర బండి వాల్చేయడం లాంటి పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు!''

''సడన్ బ్రేకులా..ఎందుకేస్తానండీ?''

''మరీ అంత అమాయకత్వం నటించకోయ్! ఇరవై ఏళ్ళ క్రితం నేనూ పాతికేళ్ళ వాడినని మర్చిపోకోయ్!''

''అలాగేనండి!'' భక్తిగా చెప్పాడు.

''ఇరవై ఒకటోరోజు అమ్మాయి బండి ఎక్కి కూర్చోగానే, డైరెక్టుగా ఏ జ్యూస్ బాక్సుకో, కాఫీకేఫ్‌కో తీసుకుపో! ముందు చెప్పకు! తీసుకెళ్ళిపో అంతే!''

''చిరాకు పడుతుందండి కోపం తెచ్చుకుంటుందేమో కూడా!''

''తీసుకెళ్ళకపోతేనే చిరాకు పడుతుంది. ఇంత 'మడిల్ హెడ్డేవిటా' అని. ముందుగా చెప్తేనే కోపం తెచ్చుకుంటుంది!''

''ముందుగా చెప్తేనా?''

''మరి! ఈ ఆడపిల్లల సంగతి నీకేం తెలుసోయ్? వాళ్ల మనసు లోతు, వాళ్ళని సృష్టించిన ఆ బ్రహ్మదేవుడు కూడా కనిపెట్టలేడు!''

''మీరు కనిపెట్టగలరా?''

''వింటావా నా సైకో అనాలిసిస్? దిమ్మ తిరిగి పోతుంది!''

''చెప్పండి!''

''కాఫీ షాప్‌కి వెళదాం వస్తావా అని నువ్వు అడిగావనుకో! మనసులో రావాలని వున్నా పైకి రాననే చెప్పాలి. చెప్పకపోతే చూసేవాళ్ళు ఏమనుకుంటారో అని సంకోచం! అందుకని నువ్వలా ఓపెన్‌గా అడిగితే, ముందు జాగ్రత్తగా తప్పనిసరిగా కాదంటుంది. చెప్పకుండా తీసుకుపోయావనుకో, ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడు అంతా నీ మీదకి నెట్టేయవచ్చు. అతడు ముందు చెప్పి వుంటే కాదనేదాన్ని అనచ్చు. తన వ్యక్తిత్వానికేమీ భంగం కలగదు. తెలుసుకోవోయ్ అనూష్! తెలివైన కుర్రాడికన్నా తన కోణం నుంచి ఆలోచించగలిగే కుర్రాడికే ఆడపిల్ల ప్రిఫరెన్సు!''

''నా మీదకి నెట్టేయడమే?! నన్ను వెధవను కోరూ నలుగురూ?''

''చిన్న చిన్న ఆనందాలకి, చిన్న చిన్న త్యాగాలు చెయ్యడం నేర్చుకోవాలోయ్!''

''రేపు పెళ్లయ్యాక, నా పెళ్ళాం నా పీకపట్టుకుంటే?''

''నువ్వామ్మాయి కాళ్ళు పట్టుకో!''

''సీరియస్‌గా చెప్పండి గురూగారూ!''

''ఇప్పుడు డిస్కవర్ చేసిన విషయాన్ని నీ పెళ్ళి దాకా మోసేంత తీరిక వుండదోయ్ ఆ నలుగురికీ! ఈలోగా మరోజంట వారి బారిన పడుతుంది. కనక అలాంటి టెన్షన్లేమీ పెట్టుకోకు!''

''అలాగేనండి! థాంక్సండి! మీ మేలు మర్చిపోలేను!''

''అలా భయపెట్టకు! నువ్వు మర్చిపోవాలి! మర్చిపోయి తీరాలి! నలుగురూ నన్నొక పెద్దమనిషిలా ట్రీట్ చేస్తున్నారు. ఈ సంగతి బయట పడిందంటే...''

''అదేం మాట గురూగారూ! దీన్నంత సాగదీసే సహనం వుండదండీ ఆ నలుగురికీ! ఈలోగా మరో పెద్ద మనిషి వారి బారిన పడతాడు. మీరలాంటి టెన్షన్లేవీ పెట్టుకోకండీ! వస్తానండీ!''

అనూష్ వెళ్ళినవైపు నిశ్చేష్టతతో చూస్తూండిపోయాను.


'దొంగ రాస్కెల్! అవసరం తీరేదాకా ఎంత అమాయకంగా నటించాడు? ఈకాలం కుర్రాళ్ళది తెలివి కాదు, అతి తెలివి!'

★★★

టైమ్ చూసుకున్నాను.

రెండవుతోంది. ఎండ చిటపటమంటోంది.

స్టోరుకెళ్ళాలంటే బద్ధకంగా అనిపించింది. రామకృష్ణ వంటిగంటకి వస్తానన్నాడు. అతడిని అక్కడికి పంపించి నేను కాస్త రిలాక్స్ అవుదామనుకున్నాను.




ఇంకా ఎందుకు రాలేదో? ఏదైనా పనిపడితే, ఫోన్ అయినా చేసేవాడు.

అతడి కథ మరో తీరు!

అతడిష్టపడుతున్న అమ్మాయి పేరు శైలజ. తెలుగు ఎమ్.ఏ చేస్తోంది. పత్రికలలో కవితలకి సంబంధించిన శీర్షికలలో అప్పుడప్పుడు ఆ అమ్మాయి పేరు కనిపిస్తూంటుంది.

రామకృష్ణ పనిచేసే బేంక్‌కి ఒకటి రెండు సార్లు డిడి తీసుకోవడానికి వచ్చిందట. చూసిన వెంటనే మనసు పారేసుకున్నాడుట. ఏదో వంకతో పలకరించబోతే, చాలా 'మీన్'గా చూసిందని చెప్పి వాపోయాడు.

''ఆ పిల్ల తీరే వేరు గురూగారూ! ఎవరినీ లెక్కజేయదు. అందరికంటే తానేదో అధికురాలన్నట్లు, అన్నిటికీ అతీతురాలన్నట్లు ప్రవర్తిస్తుంది. క్రితం పౌర్ణమికి, పరిచయం పెంచుకుందామని రాత్రంతా నిద్రకాసి, వరండాలో పచార్లు చేస్తూంటే ఒక్క 'లుక్' అయినా వేసిందేమో అడగండి! అరమోడ్పు కళ్ళతో వెన్నెలను చూస్తూ పెదవుల మధ్య పెన్ను వుంచుకుని ఆలోచిస్తూ, ఏదో రాస్తూ గడిపేసింది. ఆ పిల్లని లైన్లో పెట్టడం అసాధ్యం!''

''మగపుట్టుక పుట్టాక, అలా ప్రతి చిన్న విషయానికీ బెంబేలు పడకూడదోయ్! వ్యూహం మార్చాలంతే!''

''ఏం వ్యూహమ్మండీ?''

కొంచెం సేపు సాలోచనగా చూసి చెప్పాను. ''పద్మవ్యూహం! ఇందులోకి రావడమేకానీ పోవడముండదు!''

''చెప్పండి!'' హుషారుగా అన్నాడు.

''వచ్చే నెల నుంచి ఓ మూడొందలు నీవి కావనుకో!''

''శైలజతో క్లిక్ అవ్వాలేకానీ...అసలు నా జీతమే నాది కాదనుకుంటాను!''

''తెలుగు వార, మాస పత్రికలన్నీ వేయించుకో! ఆ అమ్మాయి చూసేలా చదువుతూండు! అప్పుడప్పుడు ఆ పుస్తకాలని నీ హృదయానికి హత్తుకుని, కళ్ళు మూసుకుంటూండు!''

''ఎందుకండీ?'' అయోమయంగా అడిగాడు.

''భావోద్రేకం అన్నమాట!''

''ఐసీ!''

''శైలజ వైపు పొరబాటుగానైనా చూడకు!''

''అది మాత్రం కుదరదండీ! ఒక్క క్షణం చూడకపోతే చచ్చిపోతాను!''

''ఓవర్ యాక్షన్ చెయ్యకు! బాంక్‌లో పని, రానూపోనూ, మొత్తం పది గంటలు. నిద్ర మరో ఎనిమిది గంటలు, ఇంకా చిల్లర పనులు రెండు గంటలు. వెరసి ఇరవై

గంటలు ఆ అమ్మాయిని చూడకుండా వుంటున్నావు. నా ఎదురుగా మనిషిలాగే నిలబడ్డావు కదా! ఆత్మకాదు కదా..అంటే..

''చంపకండి! చెప్పండి''

''కొన్ని రోజులయ్యాక శైలజే పలకరిస్తుంది. 'మీ దగ్గర ఫలానా పత్రిక వుందా' అని''

''వెంటనే పత్రికలన్నీ తన కళ్ళమీద గుట్టలా పోస్తాను!''

''వాళ్ళ నాన్నో, అన్నయ్యో చూస్తే, నీ ఎముకలన్నీ మీ నాన్న కాళ్ళ మీద గుట్టలా పోస్తారు!''

''అబ్బబ్బ! ఎలా చచ్చేదండి మీతో? ఏం చెయ్యమంటారు?''

''నువ్వూ తనకేసి 'మీన్'గా చూడు!''

''నా కంట్లో ప్రాణముండగా, నా కంఠంలో వెలుగుండగా అది ఎన్నటికీ జరగదు!''

''ఏది ఎక్కడుంటుందో తెలియనివాడివి, నీకెందుకయ్యా ప్రేమా?'' చిరాగ్గా అడిగాను.

''అదిటు, ఇదటు మార్చుకోండి! ప్లీజ్! కంటిన్యూ చెయ్యండి!''

''నువ్వూ అన్నిటికీ అతీతంగా ప్రవర్తించు! జస్ట్ వెయిట్ ఫర్ త్రీ డేస్ నాలుగోరోజు తను నీవైపు ఆరాధనగా చూడటం ఖాయం!'

''థాంక్స్ గురూగారూ! అదే జరిగితే, నా పెళ్ళికి మీకు సూటు కుట్టిస్తాను!''

''అవన్నీ అక్కరలేదు లేవోయ్''

''థాంక్సండీ! వెళతాను!''

''కోరికేసేనా వెళ్ళేది?''

''అవునండీ!''

''ఈ కరెంటు బిల్లు, ఫోను బిల్లు వచ్చి వారం అవుతోందోయ్..''

''నేను కట్టేస్తానిటివ్వండి!''

''లైసెన్సు రెన్యూ..''

''అదీ ఇలాగివ్వండి! నేను చూసుకుంటాను!''

''థాంక్సోయ్!''

''మై ప్లెజర్ సర్!''

★★★

ఆ తర్వాత పరిస్థితి మెరుగుపడిందని, ప్రోత్సాహపూర్వకంగానే వుందనీ, రేపో మాపో టోటల్‌గా ఫ్లాటరయిపోతుందని చెప్పాడు.

నిశ్చింతగా వూపిరి తీసుకున్నాను. ఈ కుర్రాళ్ళొచ్చాక, నా ప్రాణానికి హాయిగా వుంది. ఇదివరకు ప్రతి చిన్న పనికీ, పెద్దపనికీ తిరగాలంటే మహా విసుగ్గా వుండేది! స్టోరుకి బిజినెస్ పెరిగాక, మరీ ఇబ్బందయ్యేది. నా ఇంటి పక్కవాటా ఈ కుర్రాళ్ళకి అద్దెకిచ్చాక, కాస్త తెరిపిగా వుంది. సలహాలివ్వడం, దానికి తగ్గ సర్వీస్ చేయించుకోవడం..నిజానికి ఇందులో పూర్తిగా నా తప్పూ లేదు.

ఆడపిల్లలతో ఆటలాడకండిరా బాబూ! బుద్ధిగా చదువుకుని ఉద్యోగాలు చేసుకోండి! మీకు నచ్చినమ్మాయినో, పెద్దవాళ్ళు కుదిర్చిన మ్మాయినో చేసుకుని, సుఖంగా వుండండి! శారీరకంగానూ, మానసికంగానూ కాసిని కట్టుబాట్లు పెట్టుకోండి! అంటే, వీళ్ళు వింటారా? మళ్ళీ నావైపు తొంగి చూడటం మానేస్తారు! ఆ మాత్రం దానికి నేను చేదవటం దేనికి?

నా అవసరాలు నావి! నా ఇబ్బందులు నావి!

ఈ ఆడపిల్లలు మాత్రం తక్కువ తిన్నారా? మగవాడిని చూస్తే చాలు ఎక్కడలేని కులుకు వస్తుంది. లోలోపల ఎంత ఇష్టంగా వున్నా పైకి కాదు, కూడదంటూ బెట్టు చేస్తారు.

ఈ నా థియరీ ప్రాక్టికల్‌గా అర్థం అయ్యాక, కుర్రాళ్ళు ముగ్గురూ నన్ను ఆకాశమంత ఎత్తుకి ఎత్తేసారు!

నా మనస్తత్వ పరిశీలనకీ, స్త్రీ హృదయ పరిశోధనకీ జై కొట్టారు.

కలిగిన సంతోషాన్ని బయటపడనివ్వకుండా చెప్పాను, ''చెప్పాను కదోయ్! లైన్లో పడని ఆడాళ్ళుంటూ వుండరు. మెల్లగా పడేవాళ్ళు, కొద్ది కొద్దిగా పడేవాళ్ళూ, జాగ్రత్తగా పడేవాళ్ళూ మనసుని స్పందింపజేస్తే పడేవాళ్ళూ...ఇలా వుంటారంతే!''

అందరూ ఏకగ్రీవంగా అవునన్నారు.


★★★

రెండు నెలలు హాయిగా గడిచిపోయాయి!

ఆ తర్వాత కుర్రాళ్ళలో నెమ్మదిగా మార్పు రావటం ప్రారంభమైంది. కొంచెం అసంతృప్తిగా, అసహనంగా కనిపించసాగారు.

చేరదీసి అడిగితే, అందరూ ఒకేమాట, ''ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది గురూగారూ! ఆ హద్దు దాటి ఎవరూ ప్రొసీడ్ కావటం లేదు!''

ఎంతగా ఆలోచించి సలహాలిచ్చినా, ఎన్ని కొత్త పథకాలు చెప్పినా ఏదీ ఉపయోగపడటం లేదని చెప్పేసారు.




పది రోజులు గడువిమ్మని అడిగాను.

ఆలోచన ఎటూ తెగకుండానే ఇందర్ వచ్చి వాలాడు.

''గురూగారూ! వినుత ఇంట్లో ఆల్ ఇన్ వన్ పనివాడిగా కుదిరిపోవడానికి నిర్ణయించుకున్నాను!''

ఆశ్చర్యపోయాను.

''ఈ రెండు ఉద్యోగాలూ, నావల్ల కాదండీ ఇక!''

''నావల్ల కూడా కాదండీ!'' నిస్సహాయంగా అన్నాడు అనూష్, ''అర్జెంటుగా వూళ్ళో ఓ ఎకరం పొలం అమ్మేస్తేకానీ ఆ అమ్మాయి బేకరీ ఖర్చు తట్టుకోవడం నావల్ల కాదంటే, కాదు!''

''నా సంగతీ అంతే గురూగారూ! రూఫ్ ఎత్తు పుస్తకాలు చేరాయి! అవి ఏ లైబ్రరీకో డొనేట్ అయినా చెయ్యాలి, లేదా మీరు నేను కలిసి, ఓ లెండింగ్ లైబ్రెరీ అయినా ప్రారంభించాలి!''

''పోనీ, కొద్దిగా అడ్వాన్స్ కాలేకపోయారా?''

''ఇంకేమైనా వుందా?''

''తాడెత్తున లేస్తున్నారు?''

''చెవులు చిల్లులు పడేలా అరుస్తున్నారు. మాకింకా పిచ్చెక్కకపోవటం..''

''అలా డీలా పడిపోకండి! నేను చెప్పినట్లు లైన్లో పడని ఆడాళ్ళు..''

''బాబోయ్! ఈ లెక్చరు వినే ఓపికలేదండీ గురూగారూ! రేపొస్తాం! ఏదో ఆలోచించిపెట్టండి కాస్త!''

ముగ్గురూ ముఖాలు వేలాడేసుకుని వెళ్ళిపోయారు.

నాలుగ్గంటలు తీవ్రంగా ఆలోచించి, ఏ పరిష్కారమూ స్ఫురించక అలసిపోయి, నిద్రపోయాను.

హఠాత్తుగా నవ్వుల గలగలలతో మెలకువ వచ్చింది!

ఉలిక్కిపడి లేచాను.

మళ్ళీ నవ్వులు!

శ్రద్ధగా విన్నాను! పక్క కాంపౌండులో ఆడపిల్లలు కాబోలు!

నెమ్మదిగా లేచి, చప్పుడు కాకుండా బాల్కనీలోకి వెళ్ళాను.

ఆడపిల్ల గొంతు వినిపిస్తోంది, ''మగవాళ్ళు రెండు రకాలు. మనకి ఉపయోగపడనివాళ్ళు, పడేవాళ్ళు..ఉపయోగపడేవాళ్ళలో తెలివైనవాళ్ళు, తెలివితక్కువవాళ్ళు, తెలివైన వాళ్ళమనుకునే తెలివితక్కువ వాళ్ళు...'' మరో అమ్మాయి అందుకుంది, ''లైన్లో పెట్టబోయి లైన్లో పడేవాళ్ళు...'' ★